క్లుప్తంగా

శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం

గోకవరం: స్థానిక వీరభద్రునిగిద్దె ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్ర ఉత్సవాలకు శనివారం రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఏడాది శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు భక్తులు సహకరించాలని కోరారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని స్థానిక శ్రీషిర్డీ సాయి జ్యూలయరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయ ఆవరణలో శనివారం సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ చాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, భేరి రాంబాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

150 మందికి కంటి పరీక్షలు



ఏలేశ్వరంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ వైస్‌గవర్నర్ సుబ్బరాజు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ వైస్ గవర్నర్ సుబ్బరాజు ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు 150 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. 20 మంది వితంతవులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వూర రాజబాబు, కప్పల నాగభూషణం, జ్యోతుల శ్రీనివాస్, అలమండ దుర్గావెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మనం ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం



రాజుపాలెంలో వరద బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

కిర్లంపూడి: పేదలకు మనం సేవా ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మనం సేవా ఫౌండేషన్ చైర్మన్ మానూరి లత ఆధ్వర్యంలో శనివారం రాజుపాలెంలోని 170 మంది వరద బాధితులకు సుమారు రూ.40 వేల విలువైన దుప్పట్లు, పంచెలు, కరాచీనూక తదితర నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పాల్గొని వరద బాధితులకు నిత్యావసరాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మానూరి గంగరాజు, జి.భద్రం, వి.హరేరామ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్సై బలరాం బదిలీ



కిర్లంపూడిలో ఏఎస్సై బలరాంను సత్కరిస్తున్న సీఐ, ఎస్సై, సిబ్బంది

కిర్లంపూడి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ ఎస్సైగా విధులు నిర్వహించిన కొప్పుల బలరాం కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై జి.సతీష్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సత్కార సభకు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్సైగా బలరాం అందించిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువా, పూలమాలతో బలరాంను ఘనంగా సత్కరించారు.

నూతన చట్టాలను రద్దు చేయాలంటూ నిరసన

జగ్గంపేట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఎన్ఆర్‌సీ, సీఏఏ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ జగ్గంపేటలో ముస్లింలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ మనోభావాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డ్ రద్దు చట్టాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదానికి సిద్ధమవుతున్నారని వాపోయారు. కొత్త చట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మసీదు గౌరవాధ్యక్షుడు గఫూర్, షేక్ సలీం, కమిటీ అధ్యక్షుడు ఆరిఫ్, ఉపాధ్యక్షుడు బాషా తదితరులు పాల్గొన్నారు.

సామూహిక నివారణ

- వరి పంటపై ఎలుకల దాడి
- దిగుబడులు నష్టపోతున్న అన్నదాతలు
- సామూహిక నివారణతో మంచి ఫలితాలు
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



జగన్నాథపురంలో ఎలుకల మందు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కోటనందూరు: మెట్ట ప్రాంత ఆహార పంటల్లో వరి ప్రధానమైంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ వరి పంటపై ఈ ఏడాది కలుపు, తెగుళ్ల బెడదతో పాటు ఎలుకల దాడి తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎలుకలు పంటను వివిధ దశల్లో పాడు చేసి దిగుబడులకు భారీ నష్టం కలిగిస్తాయి. పుష్కలంగా నీటి లభ్యత, కలుపు ఉన్న చోట ఎలుకల బెడద ఎక్కువగా ఉంటోంది. సకాలంలో రైతులు సామూహికంగా ఎలుకల నివారణ మందును వినియోగిస్తే ఎలుకల బెడద నుంచి గట్టెక్కి మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

38,658 ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 38,658 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ విస్తీర్ణంలో సుమారుగా 5 వేల టన్నుల దిగుబడికి ఎలుకల వల్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం కారణంగా పంటపై ఎలుకల దాడి ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. నీటి లభ్యత ఎక్కువగా ఉన్న చేలు, వెడల్పు గట్లపై కలుపు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎలుకలు వరి పంటకు భారీ నష్టం కలిగిస్తున్నాయి.

పిలకలు వేసే దశలో...

ఎలుక పంటను పిలకలు వేసే దశలో 5–10 సెంటీమీటర్ల ఎత్తులో కొరికి పడేస్తుంది. ఎలుకలు పిలకలను తినడం కంటే కొరకడానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. దానికి ప్రధాన కారణం వాటికి రెండు జతల కొరికే దంతాలు ఉంటాయి. ఆ దంతాలు రోజూ 0.4 సెంటీమీటర్ల చొప్పున పెరుగుతూ ఉంటాయి. వాటిని అరగదీసుకునే ప్రయత్నంలో పంటను పాటు చేస్తుంటాయి. వరిలో పిలకలు వేసే సమయంలో ఎలుకల సంతానోత్పత్తి ఎక్కువగా ఉండి పంటకు భారీ నష్టం కలిగిస్తాయి.

చిరుపొట్ట దశలో...

చిరుపొట్ట దశలో ఎలుక చేసే నష్టం చాలా కీలకం. వరి దుబ్బులను గట్ల వెంబడే కాకుండా పొలం మధ్యలో కూడా కొరికి నష్టం కలిగిస్తుంది. దీని వల్ల అక్కడక్కడా ఖాళీలు కనిపిస్తాయి. పంట పాలుపోసుకున్న తరువాత బొరియల్లో ధాన్యపు గింజలను నిల్వ చేయడం ద్వారా కూడా నష్టం కలిగిస్తాయి. ఇలా ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాల వరకూ నష్టాన్ని కలిగిస్తాయి.

ఎలుకలకు అనుకూల పరిస్థితులు

కాలువల కింద పండించే వరి పంటలో ఎలుకల ఉధృతి ఎక్కువగా ఉంటోంది. నిరంతర ఆహారం, నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలు, సాగునీటి కాలువలు, ఉద్యాన పంటలైన కొబ్బరి, కోకో, ఆయిల్‌పాం తోటలను ఆనుకొని సాగు చేసే పంట ప్రాంతాల్లో ఎలుకల ప్రభావం ఎక్కువగా ఉంటోంది.

రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి



ఎలుకలను పూర్తి స్థాయిలో అరికట్టాలంటే రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణ మందును వినియోగించాలి. పొలం గట్లు వెడల్పు తగ్గించి కలుపు లేకుండా చూసుకుంటే ఎలుకల సమస్య ఉండదు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచితంగా ఎలుకల నివారణ మందును సరఫరా చేస్తోంది. ఎలుకల నివారణలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– కేజే చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

సమగ్ర యాజమాన్యంతో నివారణ

ఎలుకల నివారణకు సేద్య, భౌతిక, యాంత్రిక, పొగబారించడం వంటి అనేక పద్ధతులు అందుబాటులో ఉన్నప్పటికీ తక్కువ ఖర్చుతో ఎలుకలను నివారించేందుకు రసాయనిక పద్ధతిలో ప్రభుత్వం సామూహిక ఎలుకల నివారణను ప్రోత్సహిస్తోంది. ఈ విధానంపై రైతులలో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ ఉచితంగా ఎలుకల నివారణ మందును అందజేస్తోంది.

మందు తయారీ ఇలా..

ఒక కేజీ బ్రోమోడయోలిన్ మందు తయారీకి 960 గ్రాముల నూకలు, రెండు గ్రాములు బ్రోమోడయోలిన్ మందు, రెండు గ్రాముల నూనె చొప్పున కలిపి మిశ్రమం చేయాలి. అలా చేసిన మిశ్రమాన్ని ఒక ప్రాంత రైతులంతా సామూహికంగా ఎలుక బొరియల్లో పెట్టడం ద్వారా ఎలుకలను నివారించుకోవచ్చు. ఎకరానికి కేజీ చొప్పున, 1, 11 రోజుల వ్యవధిలో మందును ఎలుకల బొరియల్లో పెట్టాలి.

సత్యదేవుని దర్శించిన దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం నరేంద్ర పాటిల్

అన్నవరం: దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ బహూకరించారు. పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సముద్రంలో గుండెపోటుతో మత్స్యకారుడి మృతి

సింగరాయకొండ: సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తుని పట్టణంలోని మత్స్యకారపాలేనికి చెందిన గంట మహంకాళి (43) వినాయక చవితి పండగను పురస్కరించుకుని సింగరాయకొండ మండలం పాకల పల్లెపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం సముద్రంలో తన బంధువులతో కలిసి చేపల వేటకు వెళ్లాడు. సముద్రం లోపలికు వెళ్లిన తర్వాత గుండెనొప్పిగా ఉందని బోటులో కూర్చుని తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. దీంతో అతడిని వెంటనే ఒడ్డుకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించనున్నట్లు చెప్పారు.

యువజనోత్సవాల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు

తుని: జిల్లా యువజనోత్సవ పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం కాకినాడలో జరిగిన ఈ పోటీల్లో శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రదర్శించిన హెర్బల్ సోప్, లిక్విడ్ సోప్, ఫినాయిల్ ప్రాజెక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన పి.నందిని ఎస్‌కే మదీనా బీబీ, టి.శ్రీవల్లి, ఎం.ఉష, జి.లక్ష్మీజ్యోతి బృందం, జానపద గేయాలు (సోలో) పోటీల్లో జి.సాయిశ్రీ ప్రథమస్థానం కైవసం చేసుకోవడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జానపద గేయాలు (గ్రూపు) పోటీల్లో కె.సాత్విక, జి.సాయిశ్రీ, కె.సంధ్య, పి.ఆశ్రిత, కె.చంద్రిక, పి.లక్ష్మీఅపర్ణ ద్వితీయస్థానం సాధించారు. జానపద నృత్యం (సోలో) పోటీల్లో టి.చరణ్‌జ్యోతి తృతీయస్థానం సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను శనివారం విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీ కె.నరశింహారావు అభినందించారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



ఉపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. మండలంలోని సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నులి పురుగుల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆరోగ్యం సక్రమంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు సక్రమంగా నిర్వహించాలి

తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు



గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

గోకవరం: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదును సక్రమంగా నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు సూచించారు. గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. అలాగే ఈ–క్రాప్ నమోదు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలుత గోకవరం శివారున కృష్ణునిపాలెం వెళ్లే మార్గంలో ఉన్న పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైసరస్వతి, డిప్యూటీ తహసీల్దార్ అంబటి రజని, ఇతర రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



రమణయ్యపేటలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు

కిర్లంపూడి: మండలంలోని రమణయ్యపేటలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శనివారం ఎంపీపీ తోట రవి, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.48 లక్షలతో 90 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే గ్రామస్తులకు మంచినీటి కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, గుడాల రాంబాబు, చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, జగన్నాథరావు, కాంట్రాక్టర్ పసుపులేటి సాయిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ అప్పలరాజు, ముత్త పెద్దకాపు, సాదే కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీపేటలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం ఎస్సీపేటలో బోరు నిర్మాణానికి శనివారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించే బోరుకు ఎంపీపీతో పాటు సర్పంచ్ బత్తుల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీటీసీ కొత్తపల్లి చిన్నిబాబు తదితరులు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అధికార బుజ్జి, నల్లల బుజ్జి, బత్తుల కామరాజు, బత్తుల నాగార్జున, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచకారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్



ముక్కొల్లులో నీట మునిగిన వరి పంటలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

కిర్లంపూడి: ఏలేరు వరద, భారీ వర్షాలకు పంట నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముక్కొల్లులో ముంపునకు గురైన పంట పొలాలను మండల వ్యవసాయాధికారి జోకా అమృతతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామన్నారు. ఇప్పటికే మండలంలో ఈ–క్రాప్, ఈ–కేవైసీ నమోదు ప్రక్రియను 90 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలో పంటలు నీట మునిగిన రైతులు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో స్థానిక రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో బస్వా వీరబాబు, జ్యోతుల రాంబాబు, వీఏఏలు రమ్య, అభి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై 17 నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు సూచనలిస్తున్న ఈఓ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే అక్టోబర్ ఒకటో తేదీ వరకూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. ఆయన శనివారం తన కార్యాలయంలో దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఆదేశించారు. దేవస్థానంలో 14 రోజుల పాటు చేయాల్సిన కార్యక్రమాల ప్రణాళికను రూపొందించారు. మొదటి రెండు రోజులు రత్నగిరి, సత్యగిరులపై చెత్త, ఇతర వ్యర్థాలను తొలగిస్తారు. అనంతరం పిచ్చిమొక్కలు తొలగింపు, దేవస్థానంలోని స్టోర్ రూమ్స్, గొడౌన్లలో పనికిరాని వస్తువుల తొలగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత రెండు రోజులు కొండ దిగువన పాఠశాలల ఆవరణలు శుభ్రపరచడం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన, వచ్చే నెల 1న దేవస్థానం మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఈఓ రామచంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2న స్వచ్ఛత హీ సేవలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ నరసింహరెడ్డి, ఏఈఓలు కె.కొండలరావు, డీపీఎస్ కృష్ణారావు, ఎల్.శ్రీనివాస్, డీఈలు రాంబాబు, ఉదయ్, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 54 కేసుల పరిష్కారం



ప్రో నోటు కేసులో కక్షిదారులకు నగదు అందజేస్తున్న జడ్జి సాహితి

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 54 కేసులను పరిష్కరించి రూ.43,55,880 నగదును రికవరీ చేసినట్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి సాహితి తెలిపారు. ప్రో నోటు కేసులో వాదికి రూ.3.50 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి సాహితి మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలు, తగాదాలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలన్నారు. కక్షిదారులు పట్టింపులకు పోకుండా రాజీ మార్గంలో లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ బెంచ్ సభ్యుడిగా బుగత శివ వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుక్కుటేశ్వర రావు, కార్యదర్శి బొంగుఖారి మధు, న్యాయవాదులు అవసరాల దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ భాషా దినోత్సవం

తుని రూరల్: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జాతీయ భాషా (హిందీ) దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్.అన్నవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విశ్రాంతి ఉపాధ్యాయుడు కె.సత్యనారాయణ పాల్గొన్నారు. హిందీ భాష ఆవశ్యకత, గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తాము రూపొందించిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. వి.కొత్తూరు కేజీబీవీలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించగా విద్యార్థినీ చైత్ర వేసిన మీరబాయి వస్త్రధారణ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ అమృతవాణి బహుమతులు అందజేశారు. హిందీ ఉపాధ్యాయులు నిర్మల, సీహెచ్ ఆదిత్య, పీడీ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

తాళ్లూరు హైస్కూల్లో హిందీ దినోత్సవం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు హైస్కూల్లో శనివారం జాతీయ హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాష విశిష్టతను వివరించారు. విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన వేద-2కే24



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వేద–2కే24 పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి టెక్ ఫెస్ట్ శనివారంతో ముగిసినట్టు డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 305 కళాశాలల నుంచి 8073 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచినట్టు చెప్పారు. ఫ్యాన్లు, బల్బ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను ఏ చోట నుంచైనా ఆపరేట్ చేసే విధంగా విద్యార్థుల తయారుచేసిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయని తెలిపారు. పేపర్, ప్రాజెక్ట్, పోస్టర్ ప్రజెంటేషన్లను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, జి.సురేష్, ప్రిన్సిపాల్ రమేష్ ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కోలాట ప్రదర్శన



బెండపూడిలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

తొండంగి: గణపతి నవరాత్రుల్లో భాగంగా బెండపూడిలో వినాయక మండపం వద్ద శనివారం రాత్రి నిర్వహించిన చిన్నారుల కోలాట పదర్శన ఆకట్టుకుంది. గ్రామంలోని తూర్పుకాపుల వీధిలో చిన్నారులు కోలాటం, భక్తిపాటలకు నృత్యాలు, భరతనాట్యం వంటివి ప్రదర్శించారు. రావికంపాడు, గోపాలపట్నం, వేమవరం, పెరుమాళ్లపురం తదితర గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.


వైభవంగా దీపోత్సవం

జగ్గంపేట: గణపతి నవరాత్రుల్లో భాగంగా జగ్గంపేట బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించారు. ఓం, స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తుని రూరల్: ప్రభుత్వ నిబంధనలు ఎవరు అతిక్రమించినా ఉపేక్షించబోమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తుని మండలం తేటగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం పెద్దాపురం ఆర్డీఓ, తుని మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ తవ్వకాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు ఉండాలన్నారు. తుని పట్టణం గొల్ల అప్పారావు సెంటరులో అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రైస్ రీసైక్లింగ్‌ను అడ్డుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వహించవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో తంటికొండ వేంకటేశ్వరస్వామి

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర ఏకాదశిని పురస్కరించుకుని తంటికొండలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారులో వేంచేసిన వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తిరుమలాయపాలెంలో వరాహలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయాల అధికారులు, కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి తిరు కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

వరద బాధితులకు అండగా లయన్స్ క్లబ్

ప్రత్తిపాడు రూరల్: వరద బాధితులకు ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ అండగా నిలిచింది. లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రొఫెసర్ ఎన్వీబీఎస్ఎస్, స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో శనివారం వరద బాధితులకు నిత్యవసర వస్తువులు, చీరలు, వీధి వ్యాపారులకు గొడులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి రెడ్డి నాయుడు సహకారంతో ఆలంబన హాస్టల్‌లో బాలికలకు రూ.5 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఫకీర్ రాజు, సంజీవరావు, నక్క అప్పారావు, సాకేత్ వర్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ సర్వ సభ్య సమావేశం

తుని: రైతుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అమరావతి కో ఆపరేటివ్ సొసైటీ పని చేస్తోందని ఆ సంస్థ సీఈఓ ఆదిస్వరూప్ పట్నాయక్ తెలిపారు. స్థానిక సొసైటీ బ్రాంచి కార్యాలయంలో శనివారం అమరావతి కో ఆపరేటివ్ సొసైటీ 7వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఈఓ పట్నాయక్ మాట్లాడుతూ 2017వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ సొసైటీ మూడు బ్రాంచిలతో దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు. ఇండియన్ ఫైనాన్స్ అవుట్‌లుక్ ద్వారా 2024 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నుంచి అవార్డు పొందిన ఏకైక సంస్థ తుని బ్రాంచేనన్నారు. అనంతరం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ సురేష్‌సుబ్బాని, ఈడీ భార్గవ్, డైరెక్టర్ రోణక్‌గుప్తా, జీఎం నాగేశ్వరరావు, సిటోనిధి చైర్మన్ రజిని, సొసైటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.